ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 295 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శనివారం 1 ఫిబ్రవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# ప్రపంచంలో మూడో ఆర్థికశక్తిగా భారత్

- సామాజిక, ఆర్థిక, రాజకీయ సుస్థిరతతో ఆదర్శం
- వికసిత భారత్ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం
- మూడో టర్మ్‌లో ..మూడురెట్ల వేగంతో అభివృద్ధి
- బడ్జెట్‌లో రైతులు, మహిళలు, పేదలు, యువతకు ప్రాధాన్యం
- స్వయంసమృద్ధి, స్వావలంబన దిశగా దేశం పురోగతి
- 370 ఆర్టికల్ రద్దుతో కాశ్మీర్‌లో ప్రశాంత పరిస్థితులు
- 25 కోట్ల మందిని దారిద్ర్యం నుంచి బయటకు తీసుకొచ్చాం
- 3కోట్ల మంది పేదలకు ఇల్లు నిర్మించబోతున్నాం
- కృత్రిమ మేధ రంగంలో 'భారత ఏఐ మిషన్'
- ప్రయాగ్‌రాజ్ తొక్కిసలాట ఘటన విచారకరం
- పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగం



**న్యూఢిల్లీ, జనవరి 31 (ప్రభాత ఉదయం):** సామాజిక, ఆర్థిక, రాజకీయ సుస్థిరతలో ఈ ప్రపంచానికి భారత్ ఆదర్శంగా నిలిచిందని, మన ముందున్న ఏకైక లక్ష్యం.. 'వికసిత్ భారత్' నిర్మాణమే..అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ప్రపంచంలోనే భారత్‌ను మూడో ఆర్థిక శక్తిగా నిలపనున్నట్లు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. దేశాభివృద్ధి ఫలాలు అందరికీ అందాలన్నదే తమ ఉద్దేశమని చెప్పారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగించారు. భారత సామాజిక చేతనకు మహాకుంభమేళా నిదర్శంగా నిలుస్తోందన్నారు. దేశాభివృద్ధి కోసం వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తమ ప్రభుత్వ మూడో టర్మ్‌లో మూడు రెట్ల వేగంతో అభివృద్ధి సాగుతోందని రాష్ట్రపతి తెలిపారు. ఆరంభంలో ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనపై రాష్ట్రపతి విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. ఇటీవలే తుదిశ్వాస విడిచిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. 'మహా కుంభమేళా జరుగుతున్న సమయంలో పార్లమెంట్ సమావేశాలు ప్రారంభించుకుంటున్నాం. ఇటీవల గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నాం' అని రాష్ట్రపతి హర్షం వ్యక్తంచేశారు. బడ్జెట్‌లో

..మిగతా 2లో



## నూతన ఉస్మానియా ఆసుపత్రికి
# సీఎం శంకుస్థాపన

### 26.3 ఎకరాల్లో రూ. 2400 కోట్లతో 14 అంతస్తులు నిర్మాణం

**హైదరాబాద్, జనవరి 31 (ప్రభాత ఉదయం):** నూతనంగా నిర్మించనున్న ఉస్మానియా ఆస్పత్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. గోషామహల్ స్టేడియంలో ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఈరోజు (శుక్రవారం) ఉదయం సీఎం భూమి పూజ చేశారు. మొత్తం 26.3 ఎకరాల విస్తీర్ణంలో నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం జరుగనుంది. 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన ఆసుపత్రిని నిర్మించనున్నారు. 2 వేల పడకల సామర్థ్యంతో ఆస్పత్రి నిర్మాణానికి నిర్ణయం తీసుకుంది ప్రభుత్వం. రూ.2400 కోట్లతో 14 అంతస్తుల్లో ఆస్పత్రి భవన నిర్మాణం జరుగనుంది. అత్యాధునిక వైద్య సౌకర్యాలతో 30 విభాగాలలో వైద్య సేవలు అందించనున్నారు. కొత్త ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీలు చేసేలా సౌకర్యాలు కల్పించనున్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో కొత్త ఆస్పత్రికి డిజైన్ చేశారు. స్టాఫ్, మెడికల్ స్టూడెంట్స్ కోసం ప్రత్యేక భవనాలు నిర్మించనున్నారు. ప్రతీ గదిలో గాలి, వెలుతులు ఉండేలా డిజైన్లు చేశారు. అత్యాధునిక టెక్నాలజీలతో కూడిన మార్చురీ ఏర్పాటు చేయనున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నలువైపులా రోడ్లు వేయనున్నారు. అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఇందులో ఉండేలా ఏర్పాటు చేస్తారు. ప్రతి డిపార్ట్‌మెంట్‌కు ప్రత్యేక ఆపరేషన్ థియేటర్లు ఉండనున్నాయి. ప్రతి థియేటర్‌కు అనుబంధంగా పోస్ట్ ఆపరేటివ్, ఐసీయూ

..మిగతా 2లో

# నేను కొడితే మామూలుగా ఉండదు

- గట్టిగా కొట్టడం అలవాటు
- కాంగ్రెస్ ఏడాది పాలనలోనే రాష్ట్రం దివాళా
- అప్పడే కరెంట్ కోతలు..నీటి సమస్యలు
- ప్రాజెక్టులను పూర్తిగా పండబెట్టారు
- గురుకులాల్లో పురుగుల అన్నం పెడుతున్నారు
- కాంగ్రెస్ వాళ్లు కనబడితే జనాలు కొట్టేలా ఉన్నారు
- నేను చెప్పినా వినకుండా
- కాంగ్రెస్‌కు ఓటేసి అనుభవిస్తున్నారు
- జహీరాబాద్ బిఆర్ఎస్ నేతల భేటీలో
- కేసీఆర్ ఘాటు వ్యాఖ్యలు



2

# చెల్లని వేయినోటు కేసీఆర్

- తెలంగాణను అప్పలకుప్పగా చేసిన ఘనుడు
- పదేళ్లలో 7లక్షల కోట్లు అప్ప చేసి..దనిక రాష్ట్రమని అబద్దాలు
- ఫామ్‌హౌజ్ జీవితంతో ప్రజలకు సంబంధాలు తెగిపోయాయి
- ఎవరేం చేశారో లెక్కలు చెప్పడానికి నేను సిద్ధం
- అసెంబ్లీకి వస్తే లెక్కలు చెబుతా..ఎవరేం చేశారో తేలుద్దాం
- టిక్‌టాక్ లైకులతో సంబరపడి పోతున్న కేసీఆర్
- మొగిలిగిద్ద సభలో నిప్పులు చెరిగిన సీఎం రేవంత్ రెడ్డి



2



## త్వరలోనే మోడీ
# అమెరికా పర్యటన

### పరిశీలనలో ఉందన్న విదేశాంగ శాఖ

**న్యూఢిల్లీ, జనవరి 31 (ప్రభాత ఉదయం):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికాలో పర్యటించే అవకాశంపై కేంద్ర విదేశాంగ శాఖ స్పష్టత ఇచ్చింది. కొద్దిరోజుల క్రితమే ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్ ఫోనులో సంభాషించుకున్నారని, సాధ్యమైనంత త్వరగా మోదీ అమెరికాలో పర్యటించేందుకు ఇరుదేశాల అధికారులు కసరత్తు చేస్తున్నారని విదేశాంగశాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ చెప్పారు. ఇండో-అమెరికా సంబంధాలు మరింత బలోపేతం చేసే దిశగా మోదీ పర్యటన ఉంటుందని, ఏ తేదీల్లో అమెరికా వెళ్తారనేది త్వరలోనే తెలియజేస్తామని వివరించారు. 26/11 ముంబై పేలుళ్ల నిందితుడు తహవూర్ రాణాను ఇండియాకు రప్పించే విషయమై జైశ్వాల్ మాట్లాడుతూ, నిందితుడి పిటిషన్‌ను అమెరికా సుప్రీంకోర్టు కొట్టేసిందని, దీంతో సాధ్యమైనంత త్వరగా అతన్ని

..మిగతా 2లో

# విద్యారంగంపై ప్రత్యేక దృష్టి



- టీచర్ పోస్టులు భర్తీ చేసిన ఘనత మాదే
- యూనివర్సిటీలకు విసిలను నియమించి గాడిన పెట్టాం
- విద్యపై పెట్టుబడిని భవిష్యత్‌గా భావిస్తున్నాం
- మొగిలిగిద్ద పాఠశాల సభలో సీఎం రేవంత్ రెడ్డి

**రంగారెడ్డి, జనవరి 31 (ప్రభాత ఉదయం):** గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని యూనివర్శిటీలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, బీఆర్ఎస్ హయాంలో యూనివర్శిటీలు పునరావాస కేంద్రాలుగా మారాయని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే యూనివర్శిటీల ప్రక్షాళన చేపట్టి, వీసీలను నియమించామని ఆయన గుర్తు చేశారు. రంగారెడ్డి జిల్లాలోని మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల 150 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవాలలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొగిలిగిద్దలో నూతనంగా నిర్మించనున్న పాఠశాల భవనానికి సీఎం భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యపై ఖర్చు చేయడం అంటే... భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టడం అని చెప్పారు. విద్యాశాఖను తన దగ్గర పెట్టుకుని నిత్యం పర్యవేక్షిస్తు న్నానని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాస్మోటిక్, డైట్ చార్జీలను పెంచలేదని, మేం అధికారంలోకి రాగానే విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చార్జీలను పెంచామన్నారు. డైట్ చార్జీలు

..మిగతా 2లో



## ఫోన్ ట్యాప్ కేసులో
# ఇద్దరి విడుదల

**హైదరాబాద్, జనవరి 31 (ప్రభాత ఉదయం):** గత ప్రభుత్వ హయాంలో ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన కేసులో కీలక నిందితులైన సస్పెండెడ్ మాజీ అదనపు ఎస్పీ నాయిని భుజంగరావు, మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావులు శుక్రవారం చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు. వీరిద్దరికీ గురువారం హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.లక్ష వ్యక్తిగత బాండుతోపాటు అంతే మొత్తానికి మరో రెండు పూచీకత్తులను సమర్పించాలని ఆదేశించింది. పాస్‌పోర్టులు కింది కోర్టులో స్వాధీనం చేయాలంది. 8 వారాలపాటు ప్రతి సోమవారం దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని షరతు విధించింది. చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్‌కు వ్యక్తిగత బాండుతో పాటు పూచీకత్తులు సమర్పించడంతో ఇవాళ సాయంత్రం ఇద్దరినీ జైలు నుంచి విడుదల చేశారు. భుజంగరావు, రాధాకిషన్‌రావు ఇద్దరూ దాదాపు 10 నెలలుగా చంచల్‌గూడ జైల్లోనే ఉన్న విషయం తెలిసిందే.



# దుండిగల్ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా వెంకటేశ్వర్ నాయక్ బాధ్యతలు

### మర్యాదపూర్వకంగా కలిసిన కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్, జనవరి 31 (ప్రభాత ఉదయం) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ నూతన కమిషనర్ గా వెంకటేశ్వర్ నాయక్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి చాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బహదురుపల్లి మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు హరి నాయక్, ఎల్లుగారి వేణు పాల్గొన్నారు.

# నేను కొడితే మామూలుగా ఉండదు

**గజ్వేల్, జనవరి 31 (ప్రభాత ఉదయం):** తాను కొడితే మామూలుగా ఉండదని.. గట్టిగా కొట్టడం తన అలవాటని బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ అన్నారు. ఈ మేరకు ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌లో బిఆర్ఎస్ నేతల సమావేశంలో బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు కీలక వ్యాఖ్యలు చేశారు. జహీరాబాద్ బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజలు సంతోషంగా లేరన్నారు. గంభీరంగా, మౌనంగా ఈ ప్రభుత్వాన్ని చూస్తున్నానని అన్నారు. తాను ఎన్నో ప్రభుత్వాలను చూశానని.. ఇలాంటి ప్రభుత్వాన్ని మాత్రం చూడలేదన్నారు. ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని, కాంగ్రెస్ వాళ్లు కనబడితే జనాలు కొట్టేలా ఉన్నారన్నారు. తాను చెప్పినా ప్రజలు వినలేదని.. అత్యాశకు పోయి కాంగ్రెస్‌కు ఓటేశారన్నారు. రైతుబంధుకు రాం రాం.. దళితబంధుకు జై భీం చెబుతారని తాను ఎన్నికల సమయంలోనే చెప్పానని గుర్తు చేశారు. ఏ ప్రభుత్వం కావాలని కాంగ్రెస్ సోషల్ మీడియాలో ఓటింగ్ పెట్టారన్నారు. ఇప్పుడే మన ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వమే కావాలని ఓట్లు వేశారన్నారు. కాంగ్రెస్ పాలకులు రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించారని ఆరోపించారు. గురుకులాల్లో చదువు అగమ్యగోచరమైందని.. పురుగుల అన్నం పెడుతున్నారని మండిపడ్డారు. తులం బంగారానికి ఆశపడి కాంగ్రెస్‌కు ఓటు వేశారన్నారు. రాబోయే రోజుల్లో విజయం మనదేనన్నారు. మన విజయం తెలంగాణ ప్రజల విజయం కావాలన్నారు. ప్రత్యక్ష పోరాటాలకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పోరాటం చేస్తే తప్ప ఈ ప్రభుత్వం దిగిరాదన్నారు. ఫిబ్రవరి నెలాఖరులో భారీ సభ పెడుతామని.. బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో భూముల ధరలు అమాంతం పడిపోయాయని.. రాష్ట్రంలో ప్రాజెక్టులు అక్కడే ఆగిపోయాయని మండిపడ్డారు. సంగమేశ్వర, బసవేశ్వర, కాళేశ్వరం ప్రాజెక్టులను ఎండబెడుతున్నారంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని మబ్బులు ఇప్పుడే తొలగిపోయి నిజాలు బయటకు వస్తున్నాయన్నారు. మంచేదో చెడు ఏదో ప్రజలకు తెలుస్తుందన్నారు. మాట్లాడితే ఫామ్ హౌస్.. ఫామ్ హౌస్ అని బద్నాం చేస్తున్నారన్న కేసీఆర్.. ఫామ్ హౌస్‌లో పంటలు తప్ప ఏముంటాయని ప్రశ్నించారు. ఓట్ల కోసం కాంగ్రెస్ ముస్లింలను వాడుకుంటుందన్నారు. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల టెండర్లు ఎందుకు పిలువలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనపై అంతా అసంతృప్తే ఉందన్నారు. అన్ని వర్గాలను కాంగ్రెస్ ముంచిందన్నారు. పాలనా వైఫల్యాలను నిలదీస్తే కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ప్రాజెక్టులకు సంబంధించి ఎలాంటి పురోగతి లేదని దుయ్యబట్టారు.


# చెల్లని వేయినోటు కేసీఆర్

**రంగారెడ్డి, జనవరి 31 (ప్రభాత ఉదయం):** ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చి, రాష్ట్రపై ఏడు లక్షల కోట్లు అప్పు పెట్టిన కెసిఆర్, చెల్లని వేయిరూపాయిల నోటు లాంటి వాడని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. కేసీఆర్ రద్దయిన వెయ్యి నోటు లాంటి వారు.. ఆయనకు విలువలేదు. ఫామ్‌హౌస్‌లో ఉన్న ఆయనకు ప్రజలతో సంబంధాలు తెగిపోయినట్లున్నాయి. ఇప్పుడు మెదడు కూడా సరిగా పనిచేయడం లేదని ఘాటు విమర్శలు చేశారు. ప్రజలు తిరస్కరించినా భారాస మారలేదు. రంగారెడ్డి జిల్లా మొగిలిగిద్ద లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా జరిగిన సభలో సీఎం ప్రసంగించారు. గట్టిగా కట్టె పట్టుకుని నిలబడలేడు...గంభీరంగా గమనిస్తున్నారట..ఆయన కొడుకును, అల్లుడిని అచ్చోసిన ఆంబోతుల్లా వదిలారు...అంటూ ఘాటు విమర్శలు చేశారు. రూ.7లక్షల కోట్లు అప్పు చేసి 2023లో మాకు అప్పగించారు. గత ప్రభుత్వం రూ.18వేల కోట్లే రుణమాఫీ చేసింది. గత ప్రభుత్వం చేసిన రుణమాఫీ వడ్డీలకే సరిపోయింది. మేం అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేశాం. రుణమాఫీ చేయలేదంటున్న కేసీఆర్ అసెంబ్లీకి వస్తే లెక్కలు చెబుతాం. ఫామ్‌హౌస్‌లో ఉండి సోది చెప్పటం కాదు.. అసెంబ్లీకి రండి.. లెక్కలు చెబుతాం. ఏ గ్రామంలో ఏ రైతుకు ఎంత రుణమాఫీ చేశామో శాసనసభలో పెడతాం. కేసీఆర్‌కు చిత్తశుద్ధి, నిజాయతీ ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి. రైతు భరోసా ఎగ్గొడతారని కేసీఆర్ చెబుతున్నారు. మీలాగా మాట తప్పే వ్యక్తిని కాదు. దళితులకు 3 ఎకరాల భూమి, దళిత ముఖ్యమంత్రి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అని అనేక హామీలు ఇచ్చి మాట తప్పిన చరిత్ర కేసీఆర్‌ది. పదేళ్లు పాలించి ప్రజల దగ్గరకు వెళ్తే పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్లు కోల్పోయారు. పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చి.. ఇక్కడి ప్రాజెక్టులను పండబెట్టారని విమర్శలు గుప్పించారు. భారాస పదేళ్లలో ఇవ్వలేని ఉద్యోగాలను ఏడాదిలో ఇచ్చాం. సోషల్ మీడియాలో నాకంటే ఎక్కువ లైక్‌లు వచ్చాయంటున్నారు. కేంద్రమంత్రి, సీఎంగా చేసిన కేసీఆర్ సోషల్ మీడియాలో లైక్‌లు చూసి సంబరపడుతున్నారు. అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొంటే. మీరో.. నేనో తేల్చుకుందాం. ప్రజలు బాధపడుతున్నారని కేసీఆర్ అంటున్నారు. ఎవరూ బాధపడటం లేదు. రూ.2లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఫీజు రీయింబర్స్ మెంట్, ఆరోగ్యశ్రీ రూ.10లక్షలు, రైతు భరోసా పథకాలు అమలు చేస్తున్నాం' అని సీఎం వివరించారు. తెలంగాణను ధనిక రాష్ట్రంగా మార్చినట్లు ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి, గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన నిర్ణయాలను విమర్శించారు. తెలంగాణను అప్పుల గండం నుంచి గట్టెక్కించినట్లు ధ్వజమెత్తారు. 2023లో మా వద్దకి రూ.7 లక్షల కోట్లు అప్పు చేయడంతో వచ్చిన తెలంగాణ ప్రభుత్వం, గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రూ.18వేల కోట్ల రుణమాఫీ మాత్రమే చేసింది. ఈ రుణమాఫీ వడ్డీలకే సరిపోయింది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయడం జరిగిందని అన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి లెక్కలు చెబుతారని నమ్ముతుంటే, ఆయన ఫామ్‌హౌస్‌లో ఉండి సోది మాట్లాడటం కాదు, నిజం చెప్పాలి. అసెంబ్లీకి రమ్మని, రైతులకు ఎన్ని రుణమాఫీలు చేశామో అసెంబ్లీ ముందు వివరంగా చెప్పాలని అన్నారు. కేసీఆర్ కు చిత్తశుద్ధి ఉంటే, అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి. దళితుల కోసం 3 ఎకరాల భూమి, దళిత సీఎం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వంటి హామీలను ఇచ్చి మాట తప్పిన చరిత్ర కేసీఆర్ కు ఉంటే, అది ప్రజల్ని మోసం చేయడమే అని రేవంత్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. పదేళ్ల పాటు పాలించిన కేసీఆర్, ప్రజల నుంచి తప్పించి పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయారు. పాలమూరు ప్రాజెక్టుల గురించి హామీ ఇచ్చి, స్వంత ప్రాజెక్టులలో రుణాలు చెయ్యడమే అన్యాయంగా ఉందన్నారు. అంతేకాకుండా..' అసెంబ్లీ ఎన్నికలను అడ్డు పెట్టుకుని రైతు బంధు ఎగ్గొట్టిన చరిత్ర కేసీఆర్‌ది. ఆయన ఎగ్గొట్టిన రైతు భరోసా నిధులను మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుల ఖాతాలో వేశాం. 2014 నుంచి 2023 డిసెంబర్ వరకు కేసీఆర్ చేసిన రైతు రుణమాఫీ కేవలం రూ.18వేల కోట్లు మాత్రమే. ఇందులో మిత్తికి పోగా నికరంగా ఆయన చేసిన రుణమాఫీ కేవలం రూ.3 వేల కోట్లు మాత్రమే. కానీ మేం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 21వేల కోట్లు రుణమాఫీ చేశాం. మేం రుణమాఫీ చేయలేదంటున్న కేసీఆర్ ఫాం హౌస్ కు వచ్చినోళ్లకు చోద్యం చెప్పుడు కాదు.. అసెంబ్లీకి రా లెక్కలు చెబుతాం.. రైతుల జాబితాతో సహా మేం చేసిన రుణమాఫీ లెక్కలు చూపిస్తాం.. నీకు చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి రా.. నీలా ఇచ్చిన హామీలను ఎగ్గొట్టి పంగనామాలు పెట్టిన చరిత్ర నాది కాదు.. ఆయన గంభీరంగా చూస్తున్నడట.. ఎవరిని చూస్తున్నావ్? అచ్చోసిన ఆబోతుల్లా కొడుకు, అల్లుడిని ఊరిమీదకు వదిలిండు. జహంగీర్ పీర్ దర్గాకు, వేములవాడ రాజన్నకు నిధులు ఇస్తానని మోసం చేసినవ్.. పాలమూరును ఎరవేసి ఎండబెట్టిన దుర్మార్గుడు కేసీఆర్ అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# ప్రపంచంలో మూడో ఆర్థికశక్తిగా భారత్

మొదటి పేజీ తరువాయి...

రైతులు, మహిళలు, పేదలు, యువతకు ప్రాధాన్యం ఉంటుందని ఆమె తెలిపారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే సర్కారు.. గత ప్రభుత్వాల పాలనతో పోలిస్తే మూడు రెట్లు వేగంతో పనిచేస్తోంది. త్వరలో ప్రపంచంలో మూడో ఆర్థికవ్యవస్థగా భారత్ మారనుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పేదరిక నిర్మూలన కోసం అనేక పథకాలు అమలుచేస్తున్నాం. 25 కోట్ల మందిని దారిద్ర్యం నుంచి బయటకు తీసుకొచ్చాం. అర్హులందరికీ లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలను వేగంగా అమలుచేస్తున్నాం అని అన్నారు. మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం. అదనంగా మూడు కోట్ల కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం కోసం ప్రధానమంత్రి ఆవాస్ యోజనను పొడిగించాం అన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద.. 70 ఏళ్లు పైబడిన ఆరు కోట్ల మంది వృద్ధులకు ఆరోగ్య బీమా అందిస్తోంది. అమృత్ భారత్, నమో భారత్ రైళ్లు ప్రవేశపెడుతున్నాం. విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. యువతకు నూతన ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. నూతన విద్యా విధానంతో ఆధునిక విద్యా వ్యవస్థను ఏర్పాటుచేశాం. సంస్కరణలు వేగవంతం చేశాం. ఒకే దేశం-ఒకే ఎన్నిక, వక్ఫ్ సవరణ బిల్లు అమలు దిశగా సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నాం అని అన్నారు. దేశంలో కార్పొరేట్ సంస్థలకు మహిళలు నాయకత్వం వహిస్తున్నారు. ఒలింపిక్ పతకాలు సాధిస్తూ దేశం గర్వించేలా చేస్తున్నారు. వారి సాధికారకతకు కృషి చేస్తున్నాం. మారుమూల ప్రాంతాల్లో డిజిటల్ సేవల కల్పనలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు గొప్ప ముందడుగు. నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ కింద 91 లక్షలకు పైగా స్వయం సహాయక బృందాలకు సాధికారికత కల్పిస్తున్నాం. 3 కోట్ల మందిని లక్‌పతీ దీదీగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం అన్నారు. భారత్‌ను గ్లోబల్ ఇన్నోవేషన్ పవర్‌హౌస్‌గా మార్చడమే మా లక్ష్యం. నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను ప్రారంభించాం. కృత్రిమ మేధ రంగంలో 'భారత ఏఐ మిషన్'ను మొదలుపెట్టాం. భారత్ తన సొంత మానవ సహిత అంతరిక్ష ప్రయోగం గగన్‌యాన్‌ను ప్రయోగించే రోజు ఎంతో దూరంలో లేదు. ఎంఎస్ఎంఈలకు క్రెడిట్ గ్యారెంటీ పథకాలు, ఇ-కామర్స్ ఎగుమతి కేంద్రాలు దేశంలో అన్ని రంగాల్లో వ్యాపారాలను ప్రోత్సహిస్తున్నాయి. సైబర్ సెక్యూరిటీలో సమర్థత కోసం నిరంతరం కృషి చేస్తున్నాం. డిజిటల్ మోసాలు, సైబర్ నేరాలు, డీప్‌ఫేక్ వంటివి సామాజిక, ఆర్థిక, దేశ భద్రతకు పెను సవాళ్లుగా మారాయి. ప్రపంచ వేదికపై డిజిటల్ టెక్నాలజీలో భారత్ కీలకపాత్ర పోషిస్తోంది. మన యూపీఐ లావాదేవీల వ్యవస్థ విజయాన్ని అభివృద్ధి చెందిన దేశాలు కూడా ప్రశంసించాయి. భారత మెట్రో నెట్‌వర్క్ 1000 కిలోమీటర్ల మైలురాయిని దాటింది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్‌గా నిలిచింది.



ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం దేశవ్యాప్తంగా 1.75లక్షల ఆరోగ్య మందిర్‌లను ఏర్పాటుచేశాం. క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల కోసం వారు ఉపయోగించే పలు ఔషధాలపై కస్టమ్ సుంకాన్ని రద్దు చేశాం. గర్భిణులు, పిల్లల వ్యాక్సినేషన్ కోసం యు-విన్ పోర్టల్‌ను ప్రారంభించాం. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు సాగు ఉత్పత్తులకు గిట్టుబాటు ధర అందిస్తున్నాం. కచ్చితమైన వాతావరణ సమాచారాన్ని అందించేందుకు రూ.2000 కోట్లతో 'మిషన్ మౌసం'ను ప్రారంభించాం. సహకార రంగంలో అనేక ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం అని వివరించారు. ఆర్టికల్ 370 తర్వాత జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులు మెరుగయ్యాయి. సంస్కరణలు, పనితీరు, పరివర్తన అనేవి ప్రభుత్వ పాలనకు బలమైన స్తంభాలుగా మారాయన్నారు. సరిహద్దుల రక్షణ, అంతర్గత భద్రత కోసం ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. వామపక్ష అతివాదానికి వ్యతిరేకంగా పోరాటం చివరిదశకు చేరింది. నక్సల్స్ ప్రభావిత జిల్లాల సంఖ్య 38కు తగ్గింది. రక్షణ రంగంలో స్వావలంబన దిశగా కీలక అడుగులు వేస్తున్నాం అని రాష్ట్రపతి అన్నారు. బడ్జెట్-2025లో రైతులు, మహిళలు, పేదలు, యువతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. రూ.70 వేల కోట్లతో గ్రామీణ రహదారులను అభివృద్ధి చేస్తున్నాం. దేశాభివృద్ధి ఫలాలు అందరికీ అందాలన్నదే మా లక్ష్యం. పేద, మధ్యతరగతి ప్రజలకు హోమ్ లోన్ సబ్సిడీ ఇస్తున్నాం. ఉద్యోగుల కోసం 8వ వేతన సంఘాన్ని నియమించాం. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చాం. వన్ నేషన్ ? వన్ ఎలక్షన్ దిశగా అడుగులు వేస్తున్నాం. ట్యాక్స్ విధానాలను సరళీకరించాం. భారత్ త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుంది. చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లతో గొప్ప ముందడుగు వేస్తున్నాం. 70 ఏళ్లు దాటిన 6 కోట్లమందికి ఆరోగ్య బీమా కల్పిస్తున్నాం. యువతకు ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాం. దేశంలో లక్షా 15 వేల మంది మహిళలు లక్‌పతీ దీదీలుగా మారారు. మూడు లక్షలమంది మహిళలను లక్‌పతీ దీదీగా మార్చాలన్నదే మా ప్రభుత్వ సంకల్పం' అని రాష్ట్రపతిముర్ము తన ప్రసంగంలో వివరించారు. రాజ్యాంగం ముందునాటి చట్టాలను సమీక్షిస్తున్నాం..ప్రస్తుత కాలానికి తగినట్లు ఆ చట్టాలను మారుస్తున్నాం. అటల్ టన్నెల్, సోన్‌మార్గ్ టన్నెల్ వంటివి నిర్మించాం. భారత మెట్రో నెట్‌వర్క్ 1000 కిలోమీటర్ల మైలురాయిని దాటింది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్‌గా నిలిచింది భావితరాలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకుంటున్నాం. చ్చితమైన వాతావరణ సమాచారాన్ని అందించేందుకు రూ.2000 కోట్లతో మిషన్ మౌసంను ప్రారంభించాం అని వివరించారు. ఆమె ప్రసంగిస్తున్నంత సేపు ప్రధాని మోడీ సహా అధికారపక్ష సభ్యులు బల్లలు చరిచారు. అంతకుముందు రాష్ట్రపతి సంప్రదాయ పద్ధతిలో పార్లమెంట్‌కు చేరుకోగానే ఉప రాష్ట్రపతి ధన్‌కడ్, స్పీకర్ ఓంబిర్లాలు స్వాగతం పలికారు.

# ఎక్సైజ్ అకాడమీలో మంత్రి జూపల్లి కృష్ణారావు ఆకస్మిక తనిఖీ





బండ్లగూడ లోని ఎక్సైజ్ అకాడమిని సందర్శించిన మంత్రి జూపల్లి కృష్ణారావు.. మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

రాజేంద్రనగర్, జనవరి 31(ప్రభాత ఉదయం) : బండ్లగూడలోని ఎక్సైజ్ అకాడమీలో ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆక్మసిక తనిఖీ చేశారు. మంత్రి వెంట ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీ, అబ్కారీ శాఖ కమిషనర్ చెవ్వూరు హరికిరణ్ ఉన్నారు. అకాడమీ డైరెక్టర్ అజయ్ రావు, ఇతర అధికారులు మంత్రి జూపల్లికి స్వాగతం పలికారు. అకాడమీ పనితీరును అధికారులు మంత్రికి వివరించారు. అకాడమీ అంతా కలియతి రిగిన మంత్రి ఆయా విభాగాల పనితీరు తెలుసుకున్నారు. అనంతరం ప్రస్తుతం అకాడమీలో శిక్షణ పొందుతున్న 129 మంది మంది మహిళా ట్రైనీ కానిస్టేబుళ్లతో సంభాషించారు. శిక్షణ తరగతుల్లో చెప్పుతున్న పాఠాలు, ఫిజికల్ ట్రైనింగ్ గురించి చర్చించారు. అకాడమీలో భోజనం ఎలా ఉందని, నీటి సమస్య ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. అకాడమీలో అందుతున్న సేవలు, అక్కడి సౌకర్యాలు , శిక్షణ తరగతులు, ఇతర అంశాల గురించి శిక్షణ పొందుతున్న ఎక్సైజ్ మహిళా కానిస్టేబుల్స్ ను అడిగి తెలుసుకున్నారు. ట్రైనీలను ఉద్దేశించి మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న పోటీని తట్టుకుని.. మీరంతా ఎంతో కష్టపడి, స్వయంకృషితో ఈ ఉద్యోగానికి ఎంపికయ్యారని అభినందించారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ట్రైనీ కానిస్టేబుళ్లకు సూచించారు. సమాజానికి మేలు చేసేలా సేవలు అందించాలని, అంకితభావంతో పని చేయాలని కోరారు. సమాజ శ్రేయస్సుకు మాదకద్రవ్యాల నియంత్రణ ఎంతో ముఖ్యమని, గంజాయి, డ్రగ్స్, అక్రమ మద్యం, సారా అమ్మకాలు, రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టి, వాటి బారి నుంచి యువతను కాపాడేందుకు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఉద్బోధించారు. మాదకద్రవ్యాల సరఫరా, వినియోగించే వారి సమాచారాన్ని తెలుసుకోవడం ద్వారా, వాటి మూలాల నుంచి అరికట్టాలని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ చేస్తున్నదని అన్నారు. ఎక్సైజ్ అకాడమీలో సౌకర్యాలు బాగున్నాయని, రానున్న రోజుల్లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే మేఘారెడ్డి



రైతును సన్మానిస్తున్న వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి



ఎడ్లు బండ లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

పెబ్బేర్, జనవరి 31(ప్రభాత ఉదయం) రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని వనపర్తి శాసనసభ్యులు తుడి మేఘా రెడ్డి అన్నారు. శుక్రవారం పెబ్బేరు పట్టణంలో చౌడేశ్వరి జాతర సందర్భంగా నిర్వహించిన బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెబ్బేర్ మార్కెట్ చైర్మన్ గౌని ప్రమోదిని పాండేశ్వర్ రెడ్డి, వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి ,మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి ,శ్రీనివాస్ గౌడ్ ,అక్కి సాయి చరణ్ రెడ్డి ,రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# నూతన ఉస్మానియా ఆసుపత్రికి సీఎం శంకుస్థాపన

మొదటి పేజీ తరువాయి...

వార్డులను నిర్మిస్తారు. ప్రస్తుతం అఫ్జల్‌గంజ్‌లో ఉన్న ఉస్మానియా ఆస్పత్రి శిథిలావస్థకు చేరడంతో కొత్త ఆస్పత్రిని గోషామహల్ స్టేడియంలో నిర్మించాలని నిర్ణయించారు. భూమి పూజ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సలహాదారు వేం నరేందర్ రెడ్డి, కే కేశవరావు, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ,రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# త్వరలోనే మోడీ అమెరికా పర్యటన

మొదటి పేజీ తరువాయి...

భారతదేశానికి అప్పగించేందుకు అవసరమైన విధి విధానాలపై అమెరికాతో సంప్రదింపులు సాగిస్తున్నా మని చెప్పారు. అక్రమ వలసలపై ఇండియా వైఖరి చాలా స్పష్టంగా ఉందని, వీటిని ఎట్టపరిస్థితుల్లోనూ అంగీకరించరాదన్నదే భారత్ వైఖరి అని తెలిపారు. మైగ్రేషన్, మొబిలిటీపై ఇండియా-యూఎస్ మధ్య పరస్పర సహకారం ఉందన్నారు. అక్రమ వలసల నిరోధానికి అవసరమైన పక్రియతో ముందుకు వెళ్తామని చెప్పారు.

# విద్యారంగంపై ప్రత్యేక దృష్టి

మొదటి పేజీ తరువాయి...

40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలు 200 శాతం పెంచామని తెలిపారు. విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు పెంచడానికి 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' ఏర్పాటు చేస్తామని చెప్పారు. దేశంలో 140 కోట్ల జనాభా ఉన్నప్పటికీ ఒక్క గోల్డ్ మెడల్ రాలేదని, కానీ ఉత్తర కొరియా 30 గోల్డ్ మెడల్స్ సాధించిందని పేర్కొన్నారు. అందువల్ల, మట్టిలో మాణిక్యాలను వెలికి తీయడానికి స్పోర్ట్స్ యూనివర్శిటీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. క్రీడాకారులకు ఉద్యోగాలు, నగదు ప్రోత్సాహకాలు అందించబడతాయని చెప్పారు.మొగిలిగిద్ద పాఠశాల గత ప్రభుత్వ హయాంలో పట్టించుకోకపోవడాన్ని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. మొగిలిగిద్ద పాఠశాల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. 16 కోట్లు కేటాయించి, కొత్త భవనం నిర్మాణం ప్రారంభించారన్నారు. మొగిలిగిద్దలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ స్థాపన చేస్తున్నట్లు ప్రకటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో టీచర్ పోస్టుల భర్తీ జరగలేదని, మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే 11 వేల ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని తెలిపారు. గతంలో నోటిఫికేషన్లు ఇచ్చినా, నియామక పక్రియ సంవత్సరాల తరబడి జరుగుతున్నాయని విమర్శించారు. మేము 55 రోజుల్లోనే డీఎస్సీ నియామక పక్రియను పూర్తి చేశామని చెప్పారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, ప్రొఫెసర్ హరగోపాల్, స్థానిక ఎమ్మెల్యే తదితరులు పాల్గొన్నారు.

# 14 ఏళ్ల తర్వాత వ్యవసాయ విశ్వవిద్యాలయానికి పూర్తిస్థాయి ఉన్నతాధికారుల నియామకం


డాక్టర్ జి ఈ సీహెచ్ విద్యాసాగర్


డాక్టర్ కె ఝాన్సీ రాణి


డాక్టర్ ఎం బలరాం


డాక్టర్ ఎం యాఖాద్రి


డాక్టర్ కె బి ఈశ్వరీ


డాక్టర్ సీ హెచ్ వేణుగోపాల్ రెడ్డి


డాక్టర్ కె వి రమణారావు


డాక్టర్ జె వివేక వర్ధన్

రాజేంద్రనగర్, జనవరి 31(ప్రభాత ఉదయం):దాదాపు 14 ఏళ్ల తర్వాత వ్యవసాయ విశ్వవిద్యాలయానికి పూర్తిస్థాయి అధికారులని నియమించినట్లు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. తాను బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఈ అంశానికి అగ్ర ప్రాధాన్యమిచ్చి విశ్వవిద్యాలయ చట్టాలకు లోబడి ప్రతిభ, సమర్థత, సామాజిక సమీకరణాలను సమతూకం పాటిస్తూ ఈ నియామకాలని చేపట్టినట్లు వివరించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్, సంచాలకులు, డీన్ పదవుల నియామకాలు పూర్తి అయినట్లు ఉపకులపతి అల్దాస్ జానయ్య ప్రకటించారు. జనవరి మొదటి, రెండు వారాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి గురువారం జరిగిన పాలకమండలి సమావేశంలో పదవుల భర్తీకి ఏకగ్రీవంగా ఆమోదం తీసుకున్నామని వివరించారు. వెంటనే ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. డాక్టర్ జి ఈ సీ హెచ్ విద్యాసాగర్ ని రిజిస్ట్రార్ గా నియమించినట్లు తెలిపారు. అదేవిధంగా పరిశోధనా సంచాలకులుగా డాక్టర్ ఎం. బలరాం, పీజీ స్టడీస్ డీన్ గా డాక్టర్ కే. బి. ఈశ్వరి, విస్తరణ సంచాలకులుగా డాక్టర్ ఎం. యాకాద్రి, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ గా డాక్టర్ చల్లా వేణుగోపాల్ రెడ్డి, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ గా డాక్టర్ కె. ఝాన్సీ రాణి, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ గా డాక్టర్ కె.వి.రమణరావు, యూనివర్సిటీ లైబ్రేరియన్ గా డాక్టర్ జె. వివేక్ వర్ధన్ నియమితులైనట్లు జానయ్య తెలిపారు. వీరి పదవీకాలం మూడేళ్లుగా ఉంటుందని పేర్కొన్నారు. పరిశోధన సంచాలకులుగా నియమితులైన డాక్టర్ బలరాం అత్యంత వెనుకబడిన బోయ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అని ఆయన ఫిలిప్పైన్స్ లోని అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ నుంచి అత్యున్నత డిగ్రీ అయినా పోస్ట్ డాక్టోరల్ డిగ్రీ పొందారన్నారు. అలాగే రాయల్ సొసైటీ ఆఫ్ బయాలజీ గుర్తింపు పొందిన శాస్త్రవేత్త కూడా అని తెలిపారు. డీన్ ఆఫ్ అగ్రికల్చర్ గా ఎంపికైన డాక్టర్ కె. ఝాన్సీ రాణి వైశ్య సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అని.. మహిళా ప్రొఫెసర్ల అందరిలో అత్యంత సీనియార్టీ కలిగిన వ్యక్తి అని.. ఉత్తమ ఉపాధ్యాయురాలుగా గుర్తింపు పొందిన వ్యక్తి అని వివరించారు. విస్తరణ సంచాలకులుగా నియమితులైన బీసీ వర్గానికి చెందిన డాక్టర్ ఎం యాకాద్రి విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లలో సీనియార్టీలో మొదటి స్థానంలో ఉన్నారని, ఢిల్లీలోని ఐ ఏ ఆర్ ఐ నుండి పీహెచ్ డీ పొందినట్లు తెలిపారు. విద్యార్థి వ్యవహారాల డీన్ గా నియమితులైన డాక్టర్ చల్లా వేణుగోపాల్ రెడ్డి సుమారు 30 ఏళ్ల అనుభవం కలిగిన వ్యక్తి అని, 2013లో నేరుగా ప్రొఫెసర్ గా నియమితులైన వ్యక్తి అని, అశ్వారావుపేట అసోసియేట్ డీన్ గా బాధ్యతలు నిర్వహించారని ఉపకులపతి వివరించారు. అదేవిధంగా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన సీహెచ్ విద్యాసాగర్ రిజిస్ట్రార్ గా నియమితులైనారని ఉపకులపతి తెలిపారు. ఆయన విశ్వవిద్యాలయంలోని వివిధ పరిశోధనా సంస్థల్లో అపార అనుభవం కలిగిన వ్యక్తి అని, ఐ ఏ ఆర్ ఐ నుంచి పీహెచ్ డీ చేశారని తెలిపారు.

### మరో పది మంది కి వివిధ బాధ్యతలు :

ఈ పోస్టులతో పాటు మరో 10 మందిని కీలక పరిశోధన సంస్థలు, కేంద్రాలకు సంచాలకులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఉపకులపతి తెలిపారు. వ్యవసాయంలో వస్తున్న మార్పులకి అనుగుణంగా, రాష్ట్ర ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా పరిశోధన కేంద్రాలని పునర్వ్యవస్థీకరిస్తూ పాలకమండలి నిర్ణయం తీసుకున్నట్లు ఉపకులపతి తెలిపారు. వీటిలో భారతీయ స్టేట్ బ్యాంక్ సహాయంతో ఏర్పాటు చేయనున్న వ్యవసాయ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కేంద్రం ఒకటి కాగా, బోధన, బోధనేతర సిబ్బంది నిరంతర శిక్షణ కోసం ఉద్దేశించిన మానవ వనరుల శిక్షణా కేంద్రం ప్రధానమైనవని ఉపకులపతి వివరించారు. నియమితులైన 18 మంది అధికారులలో 5 గురు మహిళ ప్రొఫెసర్లు ఉన్నారని జానయ్య వివరించారు. జనరల్ కేటగిరి వర్గానికి చెందిన ఆరుగురిని, వెనుకబడిన వర్గాలకు చెందిన ఎనిమిది మందిని, ఎస్సీ వర్గాలకు చెందిన ముగ్గురిని, ఎస్టి వర్గానికి చెందిన ఒకరిని నియమించినట్లు వివరించారు. సమర్థత, ప్రతిభ, సామాజిక న్యాయాన్ని పరిగణలోకి తీసుకొని అధికారులని నియమించి విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేసేందుకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉపకులపతి ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా సమర్థ అధికారుల్ని నియమించి రైతాంగ సంక్షేమానికి కృషి చేసేందుకు అన్ని విధాల సహకరించిన వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సలహాదారు వేం నరేందర్ రెడ్డి లకు ఉపకులపతి ధన్యవాదాలు తెలిపారు.


పదవీ విరమణ పొందిన డాక్టర్ బి గోపాల్ ను సన్మానిస్తున్న సహచర ఉపాధ్యాయులు

## పదవీ విరమణ పొందిన బి.గోపాల్‌కు సన్మానం

రాజేంద్రనగర్, జనవరి31 (ప్రభాత ఉదయం) : శివరాంపల్లి కేంద్ర ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తు పదవీ విరమణ పొందిన డాక్టర్ బి.గోపాల్ ను శుక్రవారం సహచర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షాలిని ఆధ్వర్యంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమానికి రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ హాజరైనారు. ఈ సందర్భంగా ఎంఈఓ శంకర్ రాథోడ్ మాట్లాడుతూ, 28 సంవత్సరాల పాటు డాక్టర్ బి.గోపాల్ ఉపాధ్యాయునిగా ఉద్యోగం చేసి ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. ఆయన శేష జీవితం సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుణ్ణి ప్రార్థిసున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు సామల మహేందర్ రెడ్డి, కె.గోవర్ధన్ యాదవ్, రాఘవేందర్, సుదర్శన్, శ్రీనివాస్ సాగర్, యాదగిరి, వెంకటయ్య, బాలక్రిష్ణ, కిషన్, జగన్మోహన్ గుప్తా, జనార్ధన్ చారి తదితరులు పాల్గొన్నారు.

## నేడు కాటేడాన్, మైలార్దేవ్పల్లి, శివరాంపల్లి, హిమాయత్ సాగర్, కిస్మత్పూర్‌లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం



రాజేంద్రనగర్/బండ్లగూడ, జనవరి 31(ప్రభాత ఉదయం) శివరాంపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో శనివారం మధ్యాహ్నం ఒంటిగంట 30 నిమిషాల నుండి రెండు గంటల వరకు చింతల్ మెట్ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన వాదేయి సులేమాన్ నగర్, అక్బర్ హిల్స్, పహడి విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటిగంట నుండి ఒకటిన్నర వరకు సులేమాన్ నగర్, చింతల్ మెట్, పహడి ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శివరాంపల్లి విద్యుత్ సెక్షన్ ఇన్చార్జ్ అసిస్టెంట్ ఇంజనీర్ (సబ్ ఇంజనీర్) మానస తెలిపారు,

### కాటేదాన్ లో...

ఆటేదాన్ విద్యుత్ సెక్షన్ పరిధిలో శనివారం మధ్యాహ్నం 12 గంటల నుండి మూడు గంటల వరకు లక్ష్మీ కూడా విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన లక్ష్మీగూడ, హౌసింగ్ బోర్డ్ కాలనీ, రాజీవ్ గృహకల్ప, వాంబే కాలనీ, బృందావన్ కాలనీ, గణేష్ నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తెలిపారు.

### మైలార్దేవ్పల్లి లో..

మైలార్దేవ్పల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలోని జహంగీరాబాద్ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు క్రిస్టల్ టౌన్, జహంగీరాబాద్, మిల్లత్ నగర్, వాదేయి పహరాన్, మైలార్దేవ్పల్లి విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మహిళాదేవ్పల్లి, ప్రగతి కాలనీ, బృందావన్ కాలనీ, టాటా నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాల అంతరాయం అంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు.

### కిస్మత్పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో...

కిస్మత్పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుండి 11:30 వరకు బండ్లగూడ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన మైసమ్మ రోడ్డు, కాళికా నగర్, ఎన్ఎఫ్సీ కాలనీ, మల్లికార్జున నగర్, ఆదర్శనగర్ రోడ్ నెంబర్ 1 నుండి 5 వరకు, న్యూ కేర్ హాస్పిటల్, వికాస్ నగర్, గాయత్రి నగర్, ద్వారకా నగర్, యాదవ మిత్ర కాలనీ, షిరిడి సాయిబాబా కాలనీ, ప్రశాంత్ నగర్ కమ్యూనిటీ హాల్, భారతీ నగర్, విద్యాపీఠం విద్యుత్ పీటర్ పరిధిలో ఉదయం 11:30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు సరస్వతీ విద్యాపీఠం, భవాని కాలనీ, శ్రీ రీ ఎంక్లేవ్, శ్రీనివాసన్ ఎంక్లేవ్, ధాత్రి లేవట్, ఆనంద్ నగర్, కృష్ణానగర్, శివాజీ యూత్ బిల్డింగ్, బండ్లగూడ జాగీర్, పోచమ్మ టెంపుల్, వికాస్ నగర్, కిస్మత్పూర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు కిస్మత్పూర్ విలేజ్, రాఘవేంద్ర కాలనీ, శివ సాయి కాలనీ, బాబమ్మ కాలనీ, మైత్రి కాలనీ, వినాయక నగర్, శ్రీకృష్ణ కాలనీ, మారుతి కాలనీ, ఎస్సీ బస్తీ, ఆధ్య విల్లాస్, విల్లా గ్రీన్, ఓ ఎన్ ఎక్స్ విల్లాస్, గృహ శిల్పి, గిరిదారి అపార్ట్మెంట్స్, హనుమాన్ మందిరం ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శిక్షణ అసిస్టెంట్ ఇంజనీర్ ఏ మల్లేష్ రాజ్ తెలిపారు.

### హిమాయత్ సాగర్ సెక్షన్ లో...

హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో హైదర్ షాకోట్, స్నేహిత హిల్స్ విద్యుత్ ఫీడర్ల పరిధిలో శనివారం ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ అమర్ సింగ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయా సెక్షన్ల ఇంజనీర్లు కోరారు.


ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్‌ను కలిసిన ప్రేమావతి పేట్ వాసులు

## ప్రేమావతిపేట్ నుంచి వ్యవసాయ విశ్వవిద్యాలయంలోకి ఉన్న రహదారిలో వాహనాలు వెళ్లే విదంగా చూడండి

బుద్వేల్, జనవరి31(ప్రభాత ఉదయం) : ప్రేమావతిపేట్ నుంచి వ్యవసాయ విశ్వవిద్యాలయం లోకి గతంలో ఉన్న రోడ్డును యదావిదిగా ఉంచేవిదంగా వైస్ చాన్సలర్ తో మాట్లాడాలని కోరుతు అఖిల పక్ష నాయకులు శుక్రవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ ను కలసి విన్నవిం చుకున్నారు. వైస్ చాన్సలర్ ఎమ్మెల్యే ఎలా చెబితే అలా చేద్దాం అంటున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రేమావతిపేట్ గ్రామ మ్యాప్ ప్రస్తుతం గోడపెట్టిన ప్రాంతం బండ్లబాట గా ఉందన్నారు. గతంలో ఉన్న రోడ్డుకు అడ్డుగా గోడ పెట్టడం వల్ల వాహనాల పై వ్యవసాయ విశ్వవిద్యాలయానికి వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. అమ్మవారి దేవాలయాలు విశ్వవిద్యాలయం క్యాంపస్ లో ఉన్నాయని, అక్కడికి వెళ్లాలన్నా, పర్యిటీ లో పనులు చేయడానికి వెళ్లాలన్నా చుట్టు తిరిగి వెళ్లాల్సి వస్తుందన్నారు. ప్రేమావతిపేట్ బస్తీ యువకులతో పాటు వివిధ బస్తీల నుంచి వచ్చిన అఖిలపక్ష నాయకుల మాటలు విన్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రేమావతిపేట్ నుంచి ఐదుగురు వచ్చినట్లయితే వైస్ చాన్సలర్ దగ్గరకు తీసుకువెళ్లి మాట్లాడతా అని చెప్పినట్లు తెలిసింది. ఎమ్మెల్యే టీ ప్రకాష్ గౌడ్ ను కలిసిన వారిలో మైలార్దేవుపల్లి డివిజన్ కాంగ్రెస్ అద్యక్షుడు నత్తి ధనుంజయ్, సరికొండ వెంకటేశ్, పి.జీవన్ దాస్, మాజీ కౌన్సిలర్ కె.ఎన్ దయానంద్, బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి.మల్లేశ్ యాదవ్, మజ్జిగ నర్సింహ్మ యాదవ్, టి.జగన్, జై భీమ్ జై రాం సంఘం అధ్యక్షుడు గోల్కొండ రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యం, కోశాధికారి చంద్రశేఖర్. ఉపాధ్యక్షులు ఉపేందర్, లేవీరాజ్, సుమన్, గౌతమ్, నాని, అక్షయ్, సన్ని, విజయ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ ఎన్నికల ముందు ఆప్‌కు భారీ షాక్

### పార్టీకి రాజీనామా చేసిన ఏడుగురు ఎమ్మెల్యేలు

న్యూఢిల్లీ, జనవరి31(ప్రభాత ఉదయం) : మరో ఐదు రోజుల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనున్న వేళ దిల్లీలో కేజ్రీవాల్ కు గట్టి షాక్ తగిలింది. భాజపాతో నువ్వా నేనా అన్నట్లుగా పోటీ నెలకొన్న అత్యంత కీలక సమయంలో ఏడుగురు ఎమ్మెల్యేలు ఆమ్ ఆద్మీ పార్టీని వీడారు. పార్టీలో తమ ప్రాథమిక సభ్యత్వాలకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఎమ్మెల్యేలు భావనా గౌర్, మదన్‌లాల్ కేజ్రీవాల్‌పైనా, పార్టీపైన విశ్వాసం కోల్పోయినట్లు తెలిపారు. ఈ మేరకు ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు లేఖలు పంపారు. 'మీ పట్ల, పార్టీ పట్ల విశ్వాసం కోల్పోయాను. అందువల్లే ఈ నిర్ణయం తీసుకున్నా. దయచేసి నా రాజీనామాను ఆమోదించండి' అని భావనా గౌర్ తన లేఖలో పేర్కొన్నారు.

# గోల్డెన్ హైట్స్ కాలనీలో వీధి కుక్కల స్వైర విహారం



చిన్నారిని కరుస్తున్న వీధి కుక్కలు


కుక్క కాటుకు గురైన సుహాసిని తో తల్లి స్వాతి

## చిన్నారిని కరిచి లాక్కెల్లడానికి ప్రయత్నం

### స్థానికులు రావడంతో వదిలివెళ్లిన వీధి కుక్కలు

బుద్వేల్, జనవరి31(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ గోల్డెన్ హైట్స్ కాలనీ మసీదు చౌరస్తాలో శుక్రవారం ఉదయం ఆరు గంటలకు రెండు వీధి కుక్కలు సైర్య విహారం చేశాయి. ఇం టి ముందు ఆడుకుంటున్న ఓ చిన్నారిని కరుస్తు కాలు పట్టుకుని లాక్కెల్లడానికి ప్రయత్నించాయి. అప్పటికే స్థానికులు రావడంతో వదిలి వెళ్లిపోయాయి. వివరాలు ఈ విదంగా ఉన్నాయి... పీడీపీ చౌరస్తా నుంచి సత్సంగ్ కమాన్ లోపలకి వెళ్లాక చివరగా గోల్డెన్ హైట్స్ కాలనీ చౌరస్తాలో మసీదు ఉన్న ప్రాంతంలో ఖమ్మం నుంచి బ్రతుకుదెరువు కోసం వచ్చి స్థానికంగా వాచ్మెన్ పనులు చేసుకునే గణేశ్, స్వాతీలు నివాసం అంటారు. వారి కుమార్తె సువాసిని (4) ఇంటి ముందు అడుకుంటుంది. ఆ సమయంలో రెండు వీధి కుక్కలు అక్కడికి వచ్చి ఆ బాలికను కరువడం మొదలుపెట్టాయి. ఆ పాప అటు ఇటు పరిగెత్తిన వదలకుండ కాలుకు కరువసాగాయి. జాలిక క్రింద పడిపోగా కాలు పట్టుకుని కొద్ది దూరం లాక్కెళ్లాయి. ఆ సమయంలో స్థానికులు అటుగా వచ్చి కుక్కలను బెదిరించడంతో అవి అక్కడినుంచి పారిపోయాయి. విషయం గురించి తెలుసుకున్న సువాసిని తల్లి స్వాతి అక్కడికి చేరుకుని కుమార్తెను స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించింది.

### వీధి కుక్కలను పట్టుకెళ్లండి స్థానికులు

గోల్డెన్ హైట్స్ కాలనీలో వీధి కుక్కలు విపరీతంగా ఉన్నాయని స్థానికులు వాపోయారు. గ్రేటర్ వెటర్నరీ విభాగం వారికి ఫిర్యాదు చేస్తే పట్టుకెళ్తున్నారని. తిరిగి వదిలిపెడుతున్నారన్నారు. అలా కాకుండ వెటర్నరీ విభాగం వారు పట్టుకెళ్లి దూరంగా వదిలిపెట్టాలన్నారు.

# మూడంతస్థుల పై నుంచి పడి ఓ యువతి దుర్మరణం


రేష్మీ

బుద్వేల్, జనవరి31(ప్రభాత ఉదయం) : మూడవ అంతను పెంటౌజ్ పై నుంచి ఓ యువతి ప్రమాదవశాత్తు క్రింద పడి దుర్మరణం చెందింది. ఈ సంఘటన గురువారం రాత్రి అత్తాపూర్ మారుతీనగర్ లో జరిగింది. వివరాలు ఈ విదంగా ఉన్నాయి. మారుతీనగర్ లో నివాసం ఉండే పిన్ని గీత గర్భిణీగా ఉండటంతో ఆమె బాగోగులు చూడటానికి మహారాష్ట్ర ఉస్మానాబాద్ నుంచి రమేశ్, అరుణ ల కూతురు రేష్మీ (18) మూడు నెలల క్రితం వచ్చింది. గురువారం రాత్రి వారు నివాసం ఉంటున్న పెంట్ హౌజ్ వద్ద పిల్లలతో కలసి ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు క్రింద పడింది. ఈ సంఘటనలో రేష్మీ అక్కడిక్కడే దుర్మరణం చెందింది. రేష్మీ తల్లి అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అత్తాపూర్ ఇన్స్పెక్టర్ టి.వెంకట్రామిరెడ్డి తెలిపారు.



## యువత మేలుకో- వాహన వేగాన్ని నియంత్రించుకో

### జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్, జనవరి 31(ప్రభాత ఉదయం) జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మేడ్చల్ రవాణా శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ సైకిల్ లిస్ట్ గ్రూప్ %ఉ% ది రాయల్ క్లబ్ ఆఫ్ రైడర్స్ గ్రూప్ సభ్యుల భాగస్వామ్యంతో పేట్ బషీరాబాద్ లోని రవాణా శాఖ కార్యాలయంలో నిర్వహించిన రోడ్డు భద్రతా అవగాహన ర్యాలీ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ రోడ్డు భద్రత సమానాలను పాటించినప్పుడే మనము సురక్షితంగా గమ్యానికి చేరుకోగలమని, తద్వారా మనతోపాటు మన కుటుంబము సంతోషంగా ఉండవచ్చన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాల్లో భాగంగా వాహనాన్ని నడిపేటప్పుడు సీట్ బెల్ట్, హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలని, మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల్లో వాహనాన్ని నడపవద్దని అన్నారు. ఇటీవల కాలంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో అత్యధికులు యువకులేనని క్షణికావేశంతో వాహనాలను వేగంగా నడిపినట్లయితే ప్రమాదాలకు గురై కన్నవారికి బాధను మిగల్చవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసిపి వెంకట్ రెడ్డి, జిల్లా రవాణా అధికారి రఘునాథన్ గౌడ్, అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు, ఎంవీఐ సాధుల శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, శ్రీనుబాబు, శిల్పా, ఉమా, శ్రీకాంత్ రెడ్డి, హైదరాబాద్ సైకిల్ లిస్ట్ గ్రూప్ సైక్లిస్ట్ రవీందర్, బైక్ రైడర్ జై భారతి, రవాణా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## విప్లవ కవి గద్దర్‌కు ఘన నివాళులు


గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి31(ప్రభాత ఉదయం)తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోరాటంలో తన ఆట పాటలతో ఉద్యమాన్ని ఉత్తేజపరిచిన విప్లవ కవి, ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతి సందర్భంగా జెడ్పి మాజీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జ్ సరిత క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం గద్దర్ చిత్రపటానికి గద్వాల తాలూకా యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ధరూర్ రవి, సీనియర్ కాంగ్రెస్ నాయకులతో కలిసి పూలమాలలు ఘన నివాళులర్పించారు. అనంతరం ధరూర్ రవి మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో తన సాహిత్యం ద్వారా యావత్తు తెలంగాణ సమాజాన్ని జాగృతం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోనుపాడు శ్రీనివాస్ గౌడ్, అల్వాల రాజశేఖర్ రెడ్డి, పెదొడ్డి రామకృష్ణ, కేఎంఎస్ శ్రవణ్ కుమార్, ఆనంద్ గౌడ్, శెట్టి ఆత్మకూరు లక్ష్మణ్, ధోని ఆంజనేయులు,జమ్మిచేడు రాము,బిల్డర్ రామకృష్ణ, వడ్డే కృష్ణ తదితరులు ఉన్నారు.



కొత్తకోట మున్సిపల్ మాజీ చైర్మన్ దంపతులు పొగాకు సుకేషిని విశ్వేశ్వర్‌లను సన్మానిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

## పదవి కాలం పూర్తి చేసుకున్న కొత్తకోట మున్సిపల్ చైర్మన్ పొగాకు సుఖేషిని విశ్వేశ్వర్ దంపతులను సన్మానించిన మాజీ మంత్రి కేటీఆర్

కొత్తకోట, జనవరి 31(ప్రభాత ఉదయం) మున్సిపల్ చైర్మన్ గా పదవీకాలం పూర్తి చేసుకున్న కొత్తకోట మున్సిపల్ ఛైర్పర్సన్ పొగాకు సుకేశిని విశ్వేశ్వర్ దంపతులను కేటీఆర్ సన్మానించారు. శుక్రవారం హైదరాబాద్ లో గల తెలాంగాణ భవన్ లో బి ఆర్ ఎస్ రాష్ట్ర పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల పదవి విరమణ పొందిన కొత్తకోట మున్సిపల్ ఛైర్పర్సన్ పొగాకు సుఖేషిణి విశ్వశ్వర్ గారి దంపతులకు శాలువతో సన్మానం చేసి మెమంటో అందజేసి అభినందించారు.కొత్తకోట మున్సిపాలిటీకు విశిష్ట సేవలు అందించి జాతీయ స్థాయిలో వేగంగా అభిరుద్ధి చెందుతున్న మున్సిపాలిటీలలో కొత్తకోట మున్సిపాలిటీ మూడవది అని కేంద్ర ప్రభుత్వం చే జాతీయ స్థాయి మూడవ ర్యాంక్ సాధించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.



## యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా దూరంగా ఉండాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి31(ప్రభాత ఉదయం)యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మి నారాయణ అన్నారు. శుక్రవారం ఐడిఓసి లోని తమ ఛాంబర్ లో మాదక ద్రవ్యాల నిర్మూలన నార్కోటెక్ కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాలకు లోనవ్వకుండా దూరంగా ఉండాలని ఆదిశగా అనుబంధ శాఖల అధికారులు అవగాహన కల్పించాలని అన్నారు. గంజాయి సాగు చేస్తే శిక్షకు గురవుతారని రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. డ్రగ్స్ అమ్మే వారి గురించి పౌరులు తమ బాధ్యతగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. జిల్లా మీదుగా వెళుతున్న బస్సులను, ఇతర వాహనాలను తనిఖీ చేయాలని, సరిహద్దు ప్రాంతాలలో గట్టి నిఘా వేయాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలపై జిల్లాలో పాఠశాలు, కళాశాలల్లో, గ్రామాల్లో వివిధ రకాల ప్రభుత్వ శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు జీవితంలో స్థిర పడాల్సిన సమయంలో దురలవాట్లకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, రాబోయే భవిష్యత్తును బంగారు బాటలు వేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆర్.డి. ఓ శ్రీనివాస రావు, డీ.డబ్ల్యు.ఓ సునంద, జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్, ఇంటర్మీడియట్ అధికారి హృదయ రాజు, వైద్య శాఖ అధికారి సంధ్య కిరణ్, సి.ఐ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## వాషింగ్టన్ డిసి విమాన ప్రమాదం

### తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, జనవరి 31 (ప్రభాత ఉదయం) అమెరికాలోని వాషింగ్టన్ డీసీ సమీపంలో ఘోర ప్రమాదం జరిగిన ఘటనపై ప్రధాని మోడీ తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. ప్రయాణికుల విమానం, సైనిక హెలికాప్టర్ ఢీకొని, నదిలో పడిపోయాయి. ఈ ఘటనలో 67 మంది ప్రాణాలు కోల్పోయారు. తాజాగా ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. 'వాషింగ్టన్ డీసీలో జరిగిన ఘోర ప్రమాదంలో అనేకమంది ప్రాణాలు కోల్పోవడం నన్ను ఎంతో బాధించింది. మృతులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నా. అమెరికా ప్రజలకు సంఘీభావంగా నిలబడతాం' అని మోదీ ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. కాన్సాస్‌లోని విషిటా నుంచి బయల్దేరిన పీఎస్‌ఏ ఎయిర్‌లైన్స్ ప్రయాణికుల విమానం వాషింగ్టన్ (చిజీబరతినిణబినీని) సమీపంలోని రోనాల్డ్ రీగన్ నేషనల్ ఎయిర్‌పోర్టు రన్‌వేపై దిగేందుకు సిద్ధమైంది. ఈక్రమంలోనే రక్షణశాఖకు చెందిన సికోర్స్కీ హెచ్-60 బ్లాక్‌హాక్ హెలికాప్టర్‌ను ఢీకొట్టింది. విమానంలో 60 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉండగా.. హెలికాప్టర్‌లో ముగ్గురు సైనికులు ఉన్నారు. ఈ ఘటనలో వీరంతా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు పేర్కొన్నారు.

## శ్రీజములమ్మ బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలి

### కలెక్టర్ సంతోష్



గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి31(ప్రభాత ఉదయం )శ్రీ జములమ్మ బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు శ్రీ జములమ్మ బ్రహ్మోత్సవాలపై సంబంధిత శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 4 నుంచి 12 వరకు నిర్వహించే బ్రహ్మోత్సవములు ఘనంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు అందరూ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి మంగళవారం, శుక్రవారం దేవాలయానికి ఎక్కువ మంది వస్తారని దృష్టిలో ఉంచుకుని, ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. భద్రత ఏర్పాట్లు, భక్తులకు అవసరమైన సౌకర్యాలను పర్యవేక్షిస్తూ, ప్రోటోకాల్ ప్రకారంగా అన్ని ఏర్పాట్లు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూసుకోవాలని, ఆలయం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, క్యూలైన్లను సక్రమంగా నిర్వహించాలని ఈ.ఓ కు ఆదేశించారు. తహసిల్దార్ కు అన్ని శాఖల సమన్వయానికి వాట్స్ యాప్ గ్రూప్ ఏర్పాటు చేసి సమర్థవంతమైన నిర్వహణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఆలయ పరిసరాల పరిశుభ్రత, శానిటేషన్, తాగునీటి సదుపాయాలు,మరుగుదొడ్ల ఏర్పాటు చేయడంతో పాటు, ప్రత్యేక బస్ షెల్టర్ ఏర్పాటుకు ప్రజా ఆరోగ్య ఇంజనీర్ల సహాయంతో చర్యలు తీసుకోవాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంపై దుకాణదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. జములమ్మ బ్రహ్మోత్సవములు నందు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తగిన బందోబస్తు ఏర్పాటు, ట్రాఫిక్ నిర్వహణ, భద్రతా,పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖకు సూచించారు. ఎమర్జెన్సీ సేవలను అందుబాటులో ఉంచాలని, మెడికల్ క్యాంపులను ఉత్సవ ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశించారు. గద్వాల్ నుండి ఎర్రవల్లి వరకు అదనపు ఆర్టీసీ బస్సులు నడపడంతో పాటు, ప్రత్యేక బస్ షెల్టర్ ఏర్పాటు చేసి, అక్కడ మాత్రమే డ్రైవర్లు బస్సులు పార్క్ చేయాలని, రోడ్లపై పార్కింగ్ చేయకుండా చూడాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారులపై ఉన్న వైన్ షాపుల కారణంగా ఏవైనా సంఘటనలు జరుగకుండా ఉండేందుకు డైవర్షన్ చేసి, అక్కడ బారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఎక్సైజ్ శాఖకు ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, నీటి వద్ద ప్రమాదాలు జరగకుండా గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని అన్నారు. ఫిబ్రవరి 4 నుంచి 12 వరకు జరిగే బ్రహ్మోత్సవాలు భక్తుల భాగస్వామ్యంతో గొప్పగా నిర్వహించేందుకు ప్రతి శాఖ సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ,ఆర్డీఓ శ్రీనివాస రావు,ఈ.ఓ పురేందర్, గద్వాల్ తహసీల్దార్ మల్లికార్జున్ మున్సిపల్ కమిషనర్ దశరథ్, ఎక్సైజ్ అధికారి వీరేశ లింగం, సి.ఐ శ్రీను, సంబంధిత అధికారులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ జమ్ములమ్మ, పరశురాముడు స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల (జాతర ) గోడ పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి



గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి31(ప్రభాత ఉదయం) నడిగడ్డ ఇలవేల్పు జమ్మిచేడులోని శ్రీజమ్ములమ్మ పరుశరాముడు స్వామి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 12 నుంచి ప్రారంభం కానున్నాయి ఈ నేపథ్యంలో శుక్రవారం ఆలయ ఈఓ పురేందర్ ఆధ్వర్యంలో చైర్మన్ వెంకట్రాములు, ఆలయ కమిటి సభ్యులు గద్వాల ఎమ్మెల్యే గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి దంపతులను మర్యాద పూర్వకంగా కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా బ్రహ్మోత్సవాల గోడపత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ , వివిధ ప్రాంతాల నుండి విచ్చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలను కల్పిస్తూ భక్తులు ఎలాంటి ఇబ్బందికి గురికాకుండా ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకుని వారి మొక్కలు చెల్లించుకునే విధంగా అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవో పురేందర్ , ఆలయం కమిటీ డైరెక్టర్స్ , మాజీ ఎంపీపీ విజయ్ మాజీ జెడ్పిటిసి, రాజశేఖర్, నాయకులు రిటైర్డ్ టీచర్ కృష్ణయ్య సార్, కురుమన్న తదితరులు పాల్గొన్నారు.



## అవతార్ మెహెర్ బాబా 56వ (అమర్ తిథి) జయంతి వేడుకలు

### అవతార్ మెహెర్ బాబా'. ఆయన ఆశయాలను తరచూ ఆయన భక్తులు స్మరిస్తూనే ఉన్నారు

అహ్మద్ నగర్ , జనవరి 31 (ప్రభాత ఉదయం) అవతార్ మెహర్ బాబా 56వ (అమర్ తిథి) జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మెహర్ బాబా జయంతిని పురస్కరించుకుని మహారాష్ట్రలోని అహ్మద్ నగర్ మెహరాబాద్ లో ఆయన సమాధిని దర్శించుకునేందుకు వేలాదిగా అభిమానులు తరలివచ్చారు. మెహర్ బాబా అభిమానులు ఆయన చిత్రపటాల ప్రదర్శనశాలను భక్తులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ.... ప్రధానంగా ప్రేమ తత్వాన్ని ఆయన బోధించాడు. ఎదుటి వ్యక్తులను ప్రేమించాలన్నారు. ప్రేమతో ఎంత విరోధినైనా జయించగలమని ఆయన ప్రబోధించాడు అన్నారు. దేవుడు అన్నిటా, అంతటా, అందరిలోనూ ఉన్నాడు. గత జన్మసంస్కారాల ప్రభావం వల్ల మీలో ఉన్న దేవుణ్ణి మీరు దర్శించలేకపోతున్నారు" అని స్పష్టం చేశారు. ఏ పేరున పిలిచినా దేవుడు ఒక్కడేననీ, అన్నిమతాల సారం ఇదేననీ, తనకంటూ ప్రత్యేక మతం లేదనీ, తన మతం 'ప్రేమ' అని బాబా పలు సందర్భాలలో ప్రకటించారు.బాబా లీలలు చాలా చిత్రంగా ఉంటాయని అందరూ ప్రేమ పూర్వకంగా ఉండాలని కోరారు.ప్రేమ, సేవ, విధేయత, అన్నివేళలా నిజాయతీ... వీటిని పాటించాలి. నిత్యజీవితంలో సత్ప్రవర్తనతో నడుచుకోవాలి. అప్పుడు మానవులు తమలోని భగవంతుడిని దర్శించగలుగుతారు. రోజూ భగవన్నామస్మరణ చేస్తే ఇది సాధ్యమవుతుంది. ఆచరణపూర్వకంగా ఈ సందేశం ఇచ్చిన మహనీయుడు మెహెర్‌బాబా. నలభై నాలుగేళ్ళపాటు మౌనవ్రతాన్ని అవలంబించిన విశిష్టులు ఆయన. దర్శనమాత్రంతో అభీష్టాన్ని నెరవేర్చే దైవంగా భక్తులు ఆయనను ఆరాధిస్తారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలద్వారా బాబా వారి జీవిత చరిత్ర నాటకాన్ని చిన్నారులు ప్రదర్శించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని బాబా వారి ప్రసాదం స్వీకరించారు.



రుద్రారంలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటి సభ్యులను నియమిస్తున్న మది లేటి మాదిగ, క్యాసారం శంకర్ రావు మాదిగలు

## షాబాద్ మండలం రుద్రారం గ్రామంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

షాబాద్, జనవరి 31(ప్రభాత ఉదయం): ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేయాలని ఈనెల 7వ తేదీన నగరంలో నిర్వహించునున్న లక్షల డప్పులు – వేల గొంతులు – కోట్లాది ప్రజలు , అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గురువారం రాత్రి షాబాద్ మండలం రుద్రారం గ్రామంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాతీయ నాయకులు ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ మద్దిలేటి మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షులు నియోజకవర్గం ఇంచార్జి క్యాసా రం.శంకర్ రావు మాదిగ లు హాజరైనారు. ఈ సమావేశం యం.ప్రవీణ్ కుమార్ మాదిగ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశం లో భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ రాజ్యాంగం లో పొందుపర్చిన ఎస్సీ రిజర్వేషన్లు 15 శాతం ను ఎస్సీ కూలలో 59 కులాలు వారి వారి జనాభా ఆధారంగా పంచుకోవాలని ఆ నాటి రోజులోఈ వర్గాల పరిస్థితి అన్ని విషయాల్లోనూ వెనకబాటు ఉండం వల్ల వీరు ఐక్యతగా,ఉమ్మడిగా ఉంటే సంక్షేమ,అభివృద్ధి చెందాలనే ఉద్దేశం తొ అనాడు అంబేద్కర్ సంకల్పం తొ కల్పించారన్నారు. అంతే కాకుండా వెనకబడిన కులాలకు 96 జాతులు ఉన్న వారు ఆల్రెడీ అన్ని విషయాలలో ముందూ ఉన్నందున ఏబీసీడీ వర్గీకరణ వాళ్ళ కు చేసారన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల ను కూడా ఏబీసీడీ లుగా వార్గీకరించాలని ఎమ్మార్పీఎస్ గత 30 సంవత్సరాల నుంచి మంద కృష్ణమాదిగ నాయకత్వం లో వర్గీకరణ కు పోరాట చేస్తున్నదన్నారు. ఆగష్టు 1 న సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది మరు క్షణం అసెంబ్లీలో ముఖ్య రేవంత్ రెడ్డి అన్ని రాష్ట్రాల కంటే ముందు వర్గీకరణ అమలు చేస్తాం అంటూ ప్రకటించి చేయక పోవటం మాదిగలు ఆవేదన అన్నారు . .మంద కృష్ణమాదిగ తప్పని సరి పరిస్తితి లో హైదరాబాద్ నడిబొడ్డున వేయి గొంతులు లక్షల డప్పుల మోతలతో మార్మోగించి ప్రభుత్వం కు మాదిగ ల గోసను మరొక్క సారి తెలుపటానికి ఈ కార్యక్రమం తీసుకోవడం జరిగిందన్నారు. రంగారెడ్డి జిల్లా, షాబాద్ మండలం , రుద్రారం గ్రామం నుండి పెద్ద ఎత్తున ఉద్యమం నికి డప్పు లతో తరలిరావాలని పిలుపు ఇచ్చారు. అందుకు గ్రామ కమిటీ వారికార్యాచరణ రూపొందించుకావాలన్నారు.

**నూతన కమిటీ :**

రుద్రారం గ్రామ ఎమ్మార్పీఎస్ కమిటి అధ్యక్షులు గా చెవిటి దయాకర్ నియమితులైనారు.

ఉపాధ్యక్షులు . మచన్ పల్లి.రవీందర్, అధికార ప్రతినిధి. ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి.జైపాల్, కార్యదర్శి. అల్లాడ .వినయ్ కుమార్ , ప్రచార కార్యదర్శి. చెవిటి.వేణు, కోశాధికారి.బండి.శివ కుమార్, సలహాదారులుగాజి, అల్లాడా.సుదర్శన్, అల్లడ.భారత్ కుమార్, బండి.చంద్రశేఖర్, చెవిటి. వెంకటస్వామి ,బండి.ప్రభాకర్, చెవిటి.శ్రీనివాస్, చెవిటి.రవీందర్ లు నియమితు లైనారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చంద్రశేఖర్,రామకృష్ణ,మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608